క్లుప్తంగా

ఆయుధాలపై అవగాహన

పూసపాటిరేగ: పోలీసులు వినియోగించే ఆయుధాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయే ఆయుధాలు.. ఏయే సమయాల్లో వినియోగిస్తారో ఎస్సై వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరం

నెల్లిమర్ల: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ రామకృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక మిమ్స్ వైద్యకళాశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై బి. గణేష్, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు వేలంపాట



దుకాణాల వేలంపాట నిర్వహిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు

విజయనగరం: నగరంలోని రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్దనున్న దుకాణాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు తన చాంబర్‌లో వేలంపాట నిర్వహించగా... నలుగురు పాల్గొన్నారు. ఇందులో ఒకరు దుకాణాన్ని దక్కించుకున్నారు. రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు ఆనుకుని 22 దుకాణాలు ఉండగా వాటిలో 19 దుకాణాలను ఇదివరకే వేలంపాటలో కొంతమంది దక్కించుకున్నారు. మిగిలిన మూడింటిలో ఎస్టీ మహిళ ఒకటి, దివ్యాంగులకు ఒకటి, నాయీ బ్రాహ్మణులకు ఒకటి రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయించబడ్డాయి. అయితే వాటిలో ఈరోజు దివ్యాంగుల విభాగానికి సంబంధించి నలుగురు పోటీపడగా ఒకరు ఆరో నంబర్ షాప్‌ను దక్కించుకున్నారు.

వేలంపాట వాయిదా

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానానికి సంబంధించి తలనీలాల వేలంపాట ప్రక్రియను వాయిదా వేసినట్లు ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక దేవస్థాన ప్రాంగణంలో నిత్యాన్నదానానికి కూరగాయల సరఫరా, తలనీలాలకు వేలంపాట నిర్వహించారు. విజయనగరం పట్టణానికి చెందిన ఎం. రాజబాబు కూరగాయలను పంపిణీ చేసేందుకు వేలం దక్కించుకున్నారని ఈఓ తెలిపారు. తలనీలాల సేకరణకు వేలందారులు ఆసక్తి కనబరచకపోవడంతో వేలంపాటను వాయిదా వేశామని చెప్పారు. కార్యక్రమంలో చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయ ఈఓ బి. శ్రీనివాసరావు, సిబ్బంది తులసి, రామారావు పాల్గొన్నారు.

మొండి బకాయిదారులపై దృష్టి

విజయనగరం: ఆస్తి పన్నుకు సంబంధించి మొండి బకాయిలు వసూలు చేసేందుకు విజయనగరం కార్పొరేషన్ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు తన సిబ్బందితో కలిసి శుక్రవారం మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి బకాయిలు రాబట్టేందుకు ప్రయత్నించారు. బకాయిలు చెల్లించకుంటే దుకాణాలకు తాళం వేస్తామని హెచ్చరించారు. దీంతో దుకాణదారులు కొద్ది రోజుల సమయం ఇస్తే చెల్లిస్తామన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

విజయనగరం క్రైమ్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, పోలీస్ పిల్లలకు, పోలీస్ ఉద్యోగులకు వేర్వేరుగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలను శుక్రవారం నిర్వహించారు. రోల్ ఆఫ్ యూత్ ఇన్‌ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైమ్ అనే అంశంపై విద్యార్థులకు.. చాలెంజ్ టు పోలీస్ ఇన్ ది ప్రెజెంట్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశంపై పోటీలను నిర్వహించారు. అదేవిధంగా రైల్వే జీఆర్పీ ఎస్సై వి.బాలాజీరావు ఆధ్వర్యంలో స్థానిక కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై పోటీలు నిర్వహించి, అవగాహన కల్పించారు.

సమస్యలను పరిష్కరించాలి

- బీఎస్ఎన్ఎల్ ఈయూ కార్యదర్శి ఆలుగు



నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల వేతన, పెన్షన్ సవరణలకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఆలుగు వెంకటరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయం ఆవరణలో భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతన, పెన్షన్ సవరణను నిరాకరించడం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తామాడ కృష్ణకుమారి, లక్ష్మణకుమార్, శకుంతల, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు..

- నిరుపయోగంగా సంపద కేంద్రాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- తుప్పపడుతున్న మెషీన్లు
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు



ద్వారపూడిలోని చెత్త సంపద కేంద్రంలో మూలకు చేరిన మెషీన్లు

విజయనగరం రూరల్: గ్రామాలను శతశాతం పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ లక్షల రూపాయల వ్యయంతో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే పర్యవేక్షణ లోపంతో మండలంలోని ఆయా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో మందుబాబులు, పేకాటరాయుళ్లకు ఆవాసాలుగా మారాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో దిష్టిబొమ్మల్లా తయారయ్యాయి. పంచాయతీల్లో సేకరించిన మొత్తం చెత్తను ఒకేచోటుకు తరలించి ఆ చెత్త నుంచి సంపదను తయారుచేయాలనే ప్రధాన లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఈ కేంద్రాల్లో తయారయ్యే సంపదను విక్రయించి, గ్రామాభివృద్ధికి వినియోగించాలని ప్రభుత్వాలు భావించాయి. అయితే మొదట్లో పట్టించుకోకపోయినా, తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రాలను సక్రమంగా వినియోగించుకున్నారు. గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేయడం.. ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ చేయడం.. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించడం వంటివి జరిగాయి. చెత్త నుంచి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాయి. ఇటువంటి పరిస్థితుల్లో తాజాగా కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. చెత్త సేకరించి, కేంద్రాలకు తరలించే నాథుడే కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంలో 15 కేంద్రాలు..

మండలంలోని 22 పంచాయతీలకు గానూ 15 చెత్త సంపద కేంద్రాలున్నాయి. ఇందులో బడుకొండపేట, గొల్లలపేట గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయి. రీమాపేట, చిల్లపేట, ముడిదాం, పడాలపేట, సుంకరిపేట గ్రామాల్లో వివిధ కారణాలతో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.

వినియోగం సున్నా..

చెత్త సంపద కేంద్రాలు మండలంలో ఒక్క గ్రామంలో కూడా వినియోగానికి నోచుకోవడం లేదంటే అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గుంకలాం కేంద్రం జూదరులకు, మద్యంబాబులకు అడ్డాగా మారింది. చాలా గ్రామాల్లోని కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో విష సర్పాలకు నిలయంగా మారాయి.

పాడవుతున్న మెషీన్లు

ఒక్కో కేంద్రంలో సుమారు. రూ.3 లక్షలు విలువ చేసే యంత్రాలు ఏర్పాటు చేశారు. అయితే నెలల తరబడి వినియోగించకపోవడంతో పాడవుతున్నాయి. కొన్ని కేంద్రాల్లో అయితే మెషీన్లు కూడా కానరావడం లేదని స్థానికులు చెబుతున్నారు.



గుంకలాం సంపద కేంద్రం వెనుక పేరుకుపోయిన చెత్త

వినియోగంలోకి తీసుకురావాలి

చెత్త సంపద కేంద్రాల్లో ఉన్న మెషీన్లను వినియోగంలోకి తీసుకురావాలి. మళ్లీ వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి పంచాయతీ అభివృద్ధికి ఉపయోగించాలి. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– గురాన సూరిబాబు, ద్వారపూడి

పర్యవేక్షిస్తున్నాం..

మండలంలోని 15 చెత్త సంపద కేంద్రాలు నిర్వహణలో ఉన్నాయి. వాటిని అప్పుడప్పుడు పర్యవేక్షిస్తున్నాం. గ్రామానికి దూరంగా ఉండడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారడం వాస్తవమే. అయితే వీటిపై దృష్టి సారించి కేంద్రాలను పక్కాగా నిర్వహిస్తాం.

– తిరుపతి, పంచాయతీ విస్తరణాధికారి, విజయనగరం

బదిలీ ఉద్యోగులకు సన్మానం



విజయనగరం అర్బన్ : సత్కారం పొందుతున్న బదిలీ డీఈఓ ప్రేమ్‌కుమార్



విజయనగరం రూరల్: బదిలీపై వెళ్తున్న సీఈఓను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

విజయనగరం అర్బన్/విజయనగరం రూరల్: జిల్లాలో పనిచేసి వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న అధికారులను సహచర సిబ్బంది శుక్రవారం సన్మానించారు. డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్‌ను డీఈఓ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నూతన డీఈఓ యు.మాణిక్యంనాయుడు, ప్రధానోపాధ్యాయ, ఉపాధ్యాయ సంఘాలు ప్రతినిధులు, డీఈఓ కార్యాలయ ఏడీలు, వివిధ క్యాడర్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్‌లో సీఈఓగా విధులు నిర్వహించి విశాఖ జిల్లా ముఖ్య కార్యనిర్వాహక అధికారిగా బదిలీపై వెళ్తున్న కె.రాజ్‌కుమార్‌కు పంచాయతీరాజ్, మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రామకృష్ణరాజు, కార్యదర్శి మురళీ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'వెల్ఫేర్ డే'

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందాల్

తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు

- కమిషనర్ నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: తాగునీటి పంపిణీ విషయంలో బాధ్యతగా వ్యవహరించడంతో పాటు నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఎమినిటీస్ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పైప్‌లైన్‌లకు లీకులు ఉన్నట్లయితే వెంట వెంటనే సరిచేయాలని ఆదేశించారు. ఉదయం 9 గంటల్లోపే నీటి పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఈ టి.రాయల్‌బాబు, డీఈలు శ్రీనివాసరావు, మణికుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ వైద్య కళాశాల సేవలు

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధానాచార్యులు పద్మలీలతో సమావేశమైన భీశెట్టి బాబ్జీ

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల సేవలు ఉమ్మడి జిల్లాలోని ప్రజలకు పూర్తి స్థాయిలో అందాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధానాచార్యులు కె.పద్మలీలను లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. శుక్రవారం ఆమెతో సమావేశమై ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్వహిస్తున్న తీరు, విద్యార్థులకు కావాల్సిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో క్యాన్సర్ బాధితులతో పాటుగా కిడ్నీ బాధితుల సంఖ్య విపరీతంగా పెరుగుతోందని, వారందరికీ మెరుగైన సేవలందించాలని కోరారు.

ఘనంగా గంగాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం

పూసపాటిరేగ: మండలంలోని కందివలసలో నూతనంగా నిర్మించిన గంగాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని శుక్రవారం ఘనంగా ప్రతిష్ఠించారు. వేద పండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో కందివలస, నక్కానపేట, మాదవయ్యపేట గ్రామాలకు చెందిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ శిఖరం పైనుంచి బూరెలు జార విడచగా..వాటిని పొందేందుకు మహిళలు పోటీపడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ పరిశ్రమ ఎం.డి రమేష్‌బాబు, హెచ్‌బీఎల్ జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్, సర్పంచ్ దేశెట్టి గణేష్, మాజీ సర్పంచ్ ముత్యాలు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు చాపల సత్తిబాబు, ప్రజాప్రతినిధులు నక్కాన రమణ, పులపా మల్లేశ్వరరావు, వెంకటప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై దృష్టి సారించండి

విజయనగరం క్రైమ్: నిషేధిత గంజాయి రవాణాపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని విశాఖ రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు విజయనగరం జీఆర్పీ రైల్వే పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సిబ్బంది విధులపై చర్చించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో ఎస్సై వి.బాలాజీరావు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న విశాఖ రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- డాక్టర్ రాజేష్‌వర్మ

పూసపాటిరేగ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ వర్మ అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం జ్వరాలు బాగా విజృంభిస్తున్నాయని, అలాగే డయేరియా లక్షణాలతో చాలా మంది బాధపడుతున్నారని చెప్పారు. గ్రామాల్లో పర్యటించి అటువంటి వారిని గుర్తించి వైద్యసేవలు అందించాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆరోగ్య సహాయకులు బృందాలుగా ఏర్పడి తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని తాగేలా చైతన్య పరచాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వేదమణి, సూపర్‌వైజర్ నానమ్మ, ఆరోగ్యసహాయకులు ఆర్‌వీ రమణ, బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేష్‌వర్మ

అనుమతుల్లేని భవన నిర్మాణాలు నిలిపివేయండి

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



రిజర్వాయర్ వద్ద తాగునీటి పరీక్షలను పరిశీలిస్తున్న కమిషనర్

విజయనగరం: ఎటువంటి అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న భవనాలను నిలిపివేయాలని కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో కమిషనర్ పి. నల్లనయ్య క్షేత్రస్థాయిలో శుక్రవారం పర్యటించి తాగునీటి పంపిణీ విధానం, పారిశుధ్య పనులు, ఆక్రమిత దుకాణాల తొలగింపులను పరిశీలించారు. అంబేడ్కర్ కాలనీ, అలకానంద కాలనీ, పోలయ్యపేట, బొగ్గుల దిబ్బ, ఆర్అండ్‌బీ, తదితర ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్య పనుల తీరుపై ఆరా తీశారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న రెండు వాటర్ ట్యాంక్‌ల నుంచి జరుగుతున్న నీటి పంపిణీని పరిశీలించారు. పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి సరిచేయాలని ఆదేశించారు. అనధికార నిర్మాణాల పట్ల ఉదాసీనంగా వ్యవహరించిన ప్రణాళిక కార్యదర్శికి మెమో జారీ చేశారు. పోలయ్యపేటలో గతుకులను గమనించి వెంటనే రహదారి వేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద అనధికార నర్సరీని గుర్తించి తొలగించి వేశారు.

● అలరించి.. మురిపించి..



పైడితల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా చదురుగుడి వద్ద శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వరలక్ష్మీ నాట్యాలయ చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం ఆహూతులను ఆకట్టుకుంది. 19 మంది విద్యార్థినులు 11 పాటలకు చేసిన నృత్యం అలరించింది. నాట్యాలయ గురువు పేరి వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లలిత, నిఖిత, మౌన్విత, శ్యామశ్రీ, వినయశ్రీ, సాయిశృతి, జాహ్నవిక్రిష్ణ, సాయివెన్నెల, మనస్విని, యాశిత, లోచన, కుందన, యోగ్య, దీక్ష, జనిత, తర్మశిక, అమృత, సిరిచందన, మోక్షకృతి పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్

● 29న రక్తదాన శిబిరం



పారిశ్రామికవేత్త రతన్ టాటా జ్ఞాపకార్థం గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 29న స్థానిక ఎస్‌వీఎన్ లేక్ ప్యాలస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎంవీఎన్ వెంకటరావు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఎస్‌వీఎన్ లేక్ ప్యాలస్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, జిల్లా గ్రంథాలయ సేవా సంఘ ఉపాధ్యక్షులు కె. దయానంద్, చైతన్యబాబు, బ్లడ్‌బ్యాంక్ కౌన్సిలర్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం ఫోర్ట్

● సీఎం సహాయ నిధికి విరాళం..



విజయవాడ వరద బాధితుల సహాయార్థం జేఎన్‌టీయూ గురజాడ - విజయనగరం అధ్యాపకులు, సిబ్బంది తమ ఒకరోజు వేతనం 1,03,998 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను యూనివర్సిటీ వీసీ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ, డిప్యూటీ రిజిస్ట్రార్ కె.గంగరాజు, తదితరులు శుక్రవారం కలిసి చెక్కు అందజేశారు.

– విజయనగరం అర్బన్

● అంబరాన్నంటిన అంబలం పూజ



పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన అంబలం పూజ అంబరాన్నంటింది. పైడిమాంబ దీక్షాపీఠం ఆధ్వర్యంలో వందలాది మంది దీక్షాపరులు శుక్రవారం రాత్రి కోటవద్దకు చేరుకుని పైడితల్లికి నీరాజనాలర్పించారు. కోట పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో వేసిన అమ్మవారి గుడి సెట్ ఆకర్షణీయంగా నిలిచింది. ఈ సందర్భంగా జయహో పైడిమాంబ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు, పైడితల్లి ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు, పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, ఎస్. అచ్చిరెడ్డి, బొంగ మహేష్, డాక్టర్ హరిజగన్, దివాకర్, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, భక్తులు పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్

● ఉపాధి అవకాశాలపై సదస్సు..



టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో విదేశాల్లో చదువు - ఉపాధి అవకాశాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఓక్స్ ఓవర్సీస్ సంస్థ సీనియర్ మేనేజర్ ఎస్ఎం షరీఫ్, విదేశీ సంస్థ ప్రతినిధి మక్వాన్ మాట్లాడుతూ.. విదేశాల్లో చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఉపాధికి గల విస్తృత అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు పీఎస్వీ రమణారావు, డాక్టర్ బెహరా రంజన్, డాక్టర్ ఏకే జెనా, విద్యార్థులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్